క్లుప్తంగా

ఎర్రోనిపల్లిలో వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న 104 సిబ్బంది

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని గంగినేపల్లి పంచాయతీ పరిధిలోని ఎర్రోనిపల్లి గ్రామంలో శుక్రవారం 104 వైద్య సిబ్బంది వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది గ్రామంలో షుగర్, బీపీతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అలాగే గ్రామంలోని గర్భవతులకు రక్త పరీక్షలు చేశారు. గర్భిణులు తీసుకోవాల్సిన పోషకాహారంపై సూచనలిచ్చారు. అనంతరం వైద్య సిబ్బంది గ్రామంలో పర్యటించారు. ప్రజలు పరిశుభ్రతను పాటించాలని సూచించారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో నీరు నిల్వకుండా చూసుకోవాలన్నారు. నీరు నిల్వ ఉండటంతో దోమలు వృద్ధి చెందుతాయని తెలిపారు. దోమకాటుకు గురైతే జ్వరాలు వ్యాప్తి చెందుతాయన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ ఐశ్వర్య, ఎంపీహెచ్‌ఏ శ్రీనివాసులు, ఆశాకార్యకర్త రాజేశ్వరి, 104 సిబ్బంది పాల్గొన్నారు.

అందరికీ కంటి చూపే లక్ష్యం



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యుడు

తలుపుల: అందరికీ కంటి చూపు అందించడమే లక్ష్యంగా కంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు కంటి వైద్యుడు బి.జయరాములు తెలిపారు. స్థానిక ప్రభుత్వాస్పత్రిలో శుక్రవారం వైద్యాధికారి అష్ఫాఫ్ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించారు. మొత్తం 126 మందికి కంటి పరీక్షలు చేయగా వీరిలో 76 మందికి కంటి ఆపరేషన్ అవసరమైనట్లు గుర్తించారు. వారికి కడప పుష్పగిరి కంటి ఆసుపత్రిలో ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహించనున్నట్లు వైద్యులు తెలిపారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వైద్య సిబ్బంది

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని ఎన్ఎస్ గేట్ పీహెచ్‌సీ పరిధిలోని గర్భిణులకు శుక్రవారం వైద్య సిబ్బంది వైద్య పరీక్షలు చేశారు. వైద్యాధికారి డాక్టర్ రవినాయక్ మాట్లాడుతూ.. గర్భిణులు మంచి పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. అలాగే క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. మంచి పోషక విలువలు ఉన్న ఆహారాన్ని తీసుకోవాలన్నారు. సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి, వాటి లక్షణాలను వివరించారు. అంతకుముందు సికిల్ సెల్ ఎనీమియా వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు వైద్య సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ వెంకటరాముడు, ఎల్.టీ భాస్కర్‌రెడ్డి, ఇతర సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

రేపు వైద్య శిబిరం

అమడగూరు: అమడగూరు ఉన్నత పాఠశాల ఆవరణలో మాతృశ్రీ వృద్ధాశ్రమ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆశ్రమ నిర్వాహకురాలు అరుణజ్యోతి తెలిపారు. బెంగుళూరు సప్తగిరి ఆస్పత్రి వారు గుండె, క్యాన్సర్, కిడ్నీలో రాళ్లు, నరాలకు సంబంధించిన సమస్యలకు పరీక్షలు నిర్వహిస్తారన్నారు. రోగులు ఆధార్ కార్డును తీసుకురావాలన్నారు. ఇతర వివరాలకు 9381750414 నంబరులో సంప్రదించాలని సూచించారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



శిక్షణ పొందిన మహిళలకు ధ్రువపత్రాలు అందిస్తున్న దృశ్యం

కదిరి అర్బన్: మహిళలు ఆర్థికంగా ఎదగాలని నాబార్డ్ డీడీఎమ్ అనురాధ, ఏడీసీసీ బ్యాంక్ మేనేజర్ వెంకటాచలం పేర్కొన్నారు. పట్టణంలోని శుభయశ్రీ శారీస్ ప్రింటింగ్ యూనిట్‌లో 20 రోజులుగా వర్డ్ సంస్థ ఆధ్వర్యంలో నాబార్డ్ సహకారంతో మహిళా స్వయం సహాయక సంఘాలకు జరుగుతున్న శారీస్ హ్యాండ్ బ్లాక్ ప్రింటింగ్ శిక్షణా కార్యక్రమం శుక్రవారం ముగిసింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నాబార్డ్ డీడీఎమ్ అనురాధ, ఏడీసీసీ బ్యాంక్ మేనేజర్ వెంకటాచలం హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఇక్కడ శిక్షణ తీసుకున్న మహిళలకు స్వయం ఉపాధి కింద బ్యాంకులో రుణ సదుపాయం కల్పిస్తామన్నారు. శిక్షణా కార్యక్రమాన్ని అందిపుచ్చుకుని మహిళలు ఆర్థికంగా రాణించాలన్నారు. అనంతరం శిక్షణ తీసుకున్న మహిళలకు టూల్‌కిట్, ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వర్డ్ సంస్థ ప్రతినిధి యశోదతో పాటు పలువురు పాల్గొన్నారు.

జీవితంలో యోగా భాగం కావాలి



మాట్లాడుతున్న జడ్జీలు గీతావాణి, రమ్యసాయి



ధర్మవరం డిగ్రీ కళాశాలలో యోగాసనం వేస్తున్న ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి, అధ్యాపకులు

ధర్మవరం అర్బన్: ప్రతి మనిషికి జీవితంలో యోగా ఒక భాగం కావాలని, విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ యోగాను అలవాటు చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి గీతావాణి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి రమ్యసాయి పేర్కొన్నారు. ధర్మవరంలోని కోర్టు ప్రాంగణంలో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా న్యాయవాదులు, కోర్టు సిబ్బందితో యోగాసనాలు చేయించారు. అలాగే పట్టణంలోని కొత్తపేట శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయం ప్రాంగణంలో యోగా అసోసియేషన్ సత్యసాయి జిల్లా అధ్యక్షుడు గాజుల సోమేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ఇక కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని ప్రిన్సిపల్ ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్‌తోపాటు కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు యోగాసనాలు చేశారు.

పుట్టపర్తి రూరల్: ప్రతి మనిషి జీవితంలో యోగా భాగస్వామ్యం కావాలని పుట్టపర్తి జూనియర్ సివిల్ జడ్జి రాకేష్ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా కోర్టు ఆవరణలో న్యాయవాదులు, సిబ్బందితో కలసి జడ్జి యోగాసనాలు వేశారు. ఈసందర్భంగా జడ్జి మాట్లాడుతూ మనిషి దైనందిన జీవితంలో యోగా ప్రముఖ్యతను తెలుసుకొని మసలుకోవాలన్నారు. ఇదిలా ఉండగా సత్యసాయి అంతర్జాతీయ ఇండోర్ స్టేడియంలో సాయి విద్యార్థులు యోగా డే నిర్వహించారు.

యోగాతో మానసిక, శారీరక దృఢత్వం..

తాడిమర్రి: నిత్యం యోగా చేయడం ద్వారా మానసిక, శారీరక దృఢత్వం లభిస్తుందని ఎంపీడీఓ మణిమంజరి పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం హెచ్ఎం అరుణ అధ్యక్షతన అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ యోగా విశిష్టతను విద్యార్థులకు వివరించారు. రోజూ క్రమం తప్పకుండా యోగా చేయడంతో విద్యార్థులు ఎంతో చురుగ్గా ఉండటంతో పాటు చదువులో చక్కగా రాణిస్తారన్నారు. అలాగే పెద్దలు ప్రతి నిత్యం యోగా చేస్తున్నట్లయితే మానసికంగా, శారీరకంగా ఎంతో బలంగా ఉంటారన్నారు. అనంతరం ఆమె ఉపాధ్యాయులతో కలసి యోగాసనాలు వేశారు. ఎంఈఓలు కృష్ణమోహన్, వెంకటేష్, ఉపాధ్యాయులు నాగరాజు, శ్రీరాములు నాయక్, పీడీ వేణుగోపాల్, పీఈటీ ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌పీకుంట: యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ప్రధానోపాధ్యాయురాలు శిరీషారెడ్డి పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు పీడీ సందీప్ ఆధ్వర్యంలో యోగాసనాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థి విద్యతో పాటు, యోగాసనాలు వేయడం దినచర్య గా అలవాటు చేసుకోవాలని, తద్వారా ఒత్తిడిని జయించి లక్ష్యాన్ని చేరుకోవచ్చన్నారురు. ఉపాధ్యాయులు రామాంజులుయాదవ్, వెంకటరామిరెడ్డి, షఫీ, రిజ్వానుల్లాఖాన్, మురళి తదితరులు పాల్గొన్నారు.

నల్లచెరువు: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శుక్రవారం మండల విద్యాధికారులు ఘనంగా న్విహించారు. ఎంఈఓ తిరుపాల్ నాయక్ మాట్లాడుతూ యోగా ప్రతి ఒక్కరూ తప్పకుండా చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మితో పాటూ పలువురు యోగా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పుట్టపర్తి: ప్రతి ఒక్కరూ యోగా చేయాలని తద్వారా ఆరోగ్యవంతమైన జీవితం గడపవచ్చని యోగా గురువులు పేర్కొన్నారు. యోగా దినోత్సవం సందర్భంగా శుక్రవారం బుక్కపట్నంలోని సత్యసాయి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, మండలంలోని పలు పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులతో యోగా చేయించారు.ఈ సందర్భంగా వక్తలు యోగాతో కలిగే ప్రయోజనాలను వివరించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రవికుమార్, బాల బాలికల పాఠశాలల హెచ్ఎంలు జగదీశ్వర్, రహిమాన్, డైట్ పీడీ రామకృష్ణ, ఉన్నత పాఠశాల పీడీ నాగరాజు, ఉపాధ్యాయులు, జ్యోతిబా పూలే గురుకుల పాఠశాల ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

బత్తలపల్లి: స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం జయంతి విద్యార్థినులకు సూక్ష్మయోగా, క్రియాత్మక యోగా ఆసనాలు సాధన చేయించారు. ఉపాధ్యాయులు రాజేంద్రప్రసాద్, పద్మావతమ్మ, స్వరాజ్యలక్ష్మీ, వాంతకుమారి, నాగజ్యోతి, ప్రభావతి, సరిత, జయలక్ష్మీ, శరణ్య, షమింతాజ్ బేగం, భారతి, రమాదేవి పాల్గొన్నారు.

కదిరి అర్బన్: స్థానిక ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో శుక్రవారం కళాశాల ప్రిన్సిపాల్ డా. స్మిత ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా గురువు లక్ష్మీనారాయణ అధ్యాపకులకు ప్రాణాయామం, యోగాసానాలను నేర్పించారు. అనంతరం మానవ జీవనశైలిపై యోగా ప్రాధాన్యతను తెలియజేశారు. పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తనకల్లు: మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నల్లమాడ: యోగాతో మానసిక ప్రశాంతత చేకూరి దైనందిన కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటారని వక్తలు సూచించారు. ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు యోగాసనాలు వేశారు. ఎంఈఓ సురేష్, పాఠశాల హెచ్ఎం భాస్కర్‌రెడ్డి హెల్త్ సూపర్‌వైజర్ రామచంద్ర యోగా ప్రాముఖ్యతను తెలియపర్చారు.

యోగాతో పరిపూర్ణ ఆరోగ్యం

కనగానపల్లి: యోగా ద్వారా మానసిక ఉల్లాసంతో పాటు పరిపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని పంతాజలి యోగా గురువు అంకె సుబ్బరాయుడు తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. యోగ విద్యను వివరించారు. కనగానపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యోగా విద్య, యోగాసనాలపై యోగా గురువు సుబ్బరాయుడు విద్యార్థులకు అవగాహన కల్పించారు. రోజూ యోగా చేయటం వల్ల ఆరోగ్యవంతులుగా ఉంటారన్నారు. మామిళ్లపల్లి, తగరకుంట పాఠశాలల్లో పీఈటీలు యోగాసనాలు చేయించారు.

చెన్నేకొత్తపల్లి: యోగాతో ద్వారా సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని ఉపాధ్యాయులు అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా మండల వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ యోగా చేయడం అలవాటు చేసుకోవాలన్నారు. యోగా చేయడం ద్వారా మానసికోల్లాసంతో పాటు మానసిక ఒత్తిడి తగ్గుతుందన్నారు.

ముదిగుబ్బ: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో యోగా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ ఆదినారాయణ మాట్లాడుతూ యోగాతో శారీరక, మానసిక దృఢత్వం పెరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ యోగా సాధన చేయాలని సూచించారు. మలకవేమల, ఎనుములవారిపల్లిలో యోగా దినోత్సవాన్ని జరుపుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ రోజ, సీహెచ్ఓలు భార్గవి, శైలజ, మీనా, ఎంపీహెచ్ఈఓ వేణుగోపాల్‌రెడ్డి, పీహెచ్ఎన్ లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



పుట్టపర్తి కోర్టు ఆవరణలో యోగా సాధన



ఎన్‌పీకుంటలో యోగా చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



బుక్కపట్నం ఉన్నత పాఠశాల మైదానంలో..



సత్యసాయి ఇండోర్ స్టేడియంలో విద్యార్థుల ప్రదర్శన



తనకల్లు మండలం నల్లగుట్లపల్లి పాఠశాలలో..



బత్తలపల్లిలో యోగా చేస్తున్న విద్యార్థినులు



కనగానపల్లిలో సూర్య నమస్కారాలు చేస్తున్న విద్యార్థులు



నల్లచెరువు జెడ్పీ ఉన్నత పాఠశాలలో..



చెన్నేకొత్తపల్లి ఉన్నత పాఠశాలలో..



కనుముక్కల ఉన్నత పాఠశాలలో యోగాసనాలు

కార్మిక సమస్యల పరిష్కారమే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న కిరణ్ బుజ్జి

పుట్టపర్తి టౌన్: ఆర్టీసీ కార్మిక సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఏపీ పీడీటీ జై భీమ్ అసోసియేషన్ పని చేస్తుందని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పత్తిపాటి కిరణ్ బుజ్జి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని అబ్దుల్ కలాం షాదిమహల్ ఫంక్షన్ హాల్‌లో ఏపీ పీడీటీ జై భీమ్ అసోసియేషన్ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రతి డిపో నుంచి కార్మిక సమస్యలు గుర్తించి వాటిని పరిష్కరించేలా రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర చీఫ్ అడ్వైజర్ బాబన్న, ఎస్టీఐ పెద్దన్న, జోనల్ నాయకులు ముత్యాలు, నరసింహులు, నాయకులు పెద్దన్న బాపూజీ, రామచంద్ర, బీటీనాయక్, గణేష్ నాయక్, రమణప్ప తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'ఏరువాక' ఉత్సవం



ఏరువాక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న రైతు సంఘం నాయకులు

బత్తలపల్లి: మండల కేంద్రంలో శుక్రవారంరైతు సంఘం ఆధ్వర్యంలో ఏరువాక ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రైతు సంఘం జిల్లా నాయకులు జేవీ రమణ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కమతం కాటమయ్య ఆధ్వర్యంలో ఏరువాక పౌర్ణమి(వ్యవసాయ పండుగ) పురస్కరించుకురి బత్తలపల్లి పంట పొలాల్లో ట్రాక్టర్‌తో దుక్కిదున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగుకు రైతులు సమాయత్తం అవుతున్నారన్నారు. బీడువారిన నేలలపై వానజల్లులు కురిసి రైతులు సాగు చేసిన పంట పొలాల్లో సిరులు పండి, రైతుల కళ్లల్లో సంతోషం నిండాలని రైతు సంఘం నాయకులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక జిల్లా సహాయ కార్యదర్శి మాల్యవంతం కుళ్లాయప్ప, సీపీఐ మండల కార్యదర్శి బండల వెంకటేష్, రైతు సంఘం మండలాధ్యక్షుడు సత్తప్ప, కార్యదర్శి సాకే రామకృష్ణ, నాగభూషణ, సూరి, ఆదెప్ప, సాకే దేవసాయి, నారాయణ, గేరంగుల రామాంజి, రామదాసు, బోయపాటి రామప్ప, మహబూబ్ బాషా, ముత్యాలప్ప తదితరులు పాల్గొన్నారు.

'నీట్' అవకతవకలపై నిరసన



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ఇండియా కూటమి నాయకులు

కనగానపల్లి: భారత ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడంతో ఎన్‌డీఏ ప్రభుత్వం విఫలమైందని కాంగ్రెస్, వామపక్ష పార్టీల నాయకులు విమర్శించారు. వైద్య, విద్య కోసం దేశ వ్యాప్తంగా నిర్వహించిన నీట్ అవకతవకలపై శుక్రవారం ఇండియా కూటమి నాయకులు కనగానపల్లిలో నిరసన వ్యక్తం చేశారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని డా.బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద వినతిపత్రం ఉంచి నిరసన తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ బిల్లే ముత్యాలు, సీపీఎం నాయకులు కదిరప్ప, పలువురు విద్యార్థి సంఘం నాయకులు పాల్గొన్నారు.

దోమలు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలి



కునుకుంట్లలో అపరిశుభ్రత ప్రదేశాలను గుర్తిస్తున్న వైద్య సిబ్బంది



కేజీబీవీలో దోమల మందు పిచికారీ చేయిస్తున్న వైద్య సిబ్బంది



డ్రమ్ములో నిల్వచేసిన నీటిని పరిశీలిస్తున్న ఆరోగ్య సిబ్బంది

తాడిమర్రి: గ్రామాల్లో దోమలు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలని వైద్య సిబ్బంది గ్రామస్తులకు సూచించారు. కునుకుంట్ల, చిన్నచిగుళ్లరేవు, దాడితోట, పెద్దకోట్ల, నార్శింపల్లి, ఎం.అగ్రహారం, పిన్నదరి, చిల్లవారిపల్లి తదితర గ్రామాల్లో శుక్రవారం వైద్య సిబ్బంది డ్రై డే ఫ్రైడే నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎన్ఎంలు, ఆరోగ్య కార్యకర్తలు వీధుల్లో పర్యటిస్తూ నీటి గుంతలు, అపరిశుభ్రత ప్రదేశాలను గుర్తించి బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. అలాగే ఇటీవల కురిసిన వర్షాలకు పాతటైర్లు, చిప్పలు, పగిలిన కుండల్లో నిల్వ ఉన్న వర్షపు నీటితోపాటు తొట్టెల్లో నిల్వ చేసిన నీటిని పారబోయించారు. వర్షాల కాలంలో దోమలు ప్రబలే అవకాశం ఉందని, దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఏఎన్ఎంలు సుగుణ, లక్ష్మీకాంతమ్మ, నాగలక్ష్మమ్మ, ఆరోగ్య కార్యకర్తలు హర్షవర్ధన్‌రెడ్డి, రంగనాయకులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

తలుపుల: విద్యార్థులు దోమలపై అప్రమత్తంగా ఉండాలని మలేరియా సబ్ యూనిట్ అధికారు రామాంజనేయులు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక బీసీ హాస్టల్, కేజీబీవీలోని గదుల్లో మలాథియన్ మందును పిచికారీని ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఓ మోహనమ్మ, సూపర్‌వైజర్ రామ్మోహన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలి

నల్లమాడ: ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని ఆరోగ్య సిబ్బంది ప్రజలకు సూచించారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆరోగ్య సిబ్బంది పర్యటించి ప్రజలకు పలు సూచనలు, సలహాలిచ్చారు. వర్షాకాలంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం పాత్రల్లో నిల్వచేసిన నీటిని పారబోవడం వల్ల అందులోని లార్వా నశించి దోమలు వృద్ధి చెందవన్నారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఇళ్లముందు డ్రమ్ములు, తొట్టెల్లో నిల్వచేసిన నీటిని పరిశీలించారు.

వైభవం.. లక్ష్మీచెన్నకేశవస్వామి గరుడోత్సవం



గరుడ వాహనంపై కొలువైన లక్ష్మీచెన్నకేశవస్వామి

ధర్మవరం అర్బన్: పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో శుక్రవారం సాయంత్రం పౌర్ణమి సందర్భంగా గరుడోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ ఈఓ వెంకటేషులు సమక్షంలో గరుడ వాహనంపై లక్ష్మీచెన్నకేశవ స్వామి కొలువుదీరి పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం గోదా రంగనాథ మహిళా సంఘం సభ్యులు ప్రదర్శించిన కోలాటం అందరిని ఆకట్టుకుంది. ఇదిలా ఉండగా పట్టణంలోని మార్కెట్ యార్డు సమీపంలోనున్న రమణ మహర్షి ఆశ్రమంలో పౌర్ణమి సందర్భంగా శ్రీ అరుణాచల శివ నామస్మరణతో భక్తులు రమణ మహర్షికి పూజలు చేశారు. అనంతరం మహా పరిపూర్ణ శాంతి యాగం చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చక్రవర్తి

ధర్మవరం అర్బన్: పట్టణంలోని మారుతీనగర్‌లో శుక్రవారం ఆటో ఢీకొనడంతో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. పట్టణానికి చెందిన చక్రవర్తి అనే వ్యక్తి బైక్‌పై వెళ్తుండగా నీళ్ల తరలించే ఆటో వెనుక వైపు నుంచి ఢీకొంది. ఘటనలో అతడి కుడి కాలుకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే అతడిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం అనంతపురం తీసుకెళ్లారు. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని చంద్రబాబునగర్‌లో ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. పోలీసులు తెలిపిన వివరాలు...చంద్రబాబునగర్‌కు చెందిన సుబ్బరాయుడు శుక్రవారం రాత్రి ఇంటిలో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచనల మేరకు అనంతపురం ఆసుపత్రికి తరలించారు. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియలేదు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలి



న్యామద్దెల సర్కిల్‌లో ర్యాలీ చేపట్టిన విద్యార్థులు

చెన్నేకొత్తపల్లి: బడిఈడు పిల్లలను తప్పనిసరిగా బడిలో చేర్పించాలని విద్యాశాఖ అధికారులు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలో ఎంఈఓ-1 మున్వర్ బాషా, ఎంఈఓ-2 ప్రసన్నకుమార్ నాయుడు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఓబుళమ్మ ఆధ్వర్యంలో నేను బడికి పోతా కార్యక్రమం నిర్వహించారు. ఉన్నత పాఠశాల నుంచి ప్రారంభమైన ర్యాలీ ప్రధాన రహదారి గుండా స్థానిక న్యామద్దెల సర్కిల్ వరకు సాగింది. అక్కడ విద్యార్థులు మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓలు మాట్లాడుతూ.. బడి బయట పిల్లలను గుర్తించి బడిలో చేరే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్యామల, ఎస్సీ బాలుర వసతి గృహం అధికారి శంకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వారపు సంతల వేలం

అమడగూరు: అమడగూరు, మహమ్మదాబాద్ గ్రామాల్లో నిర్వహించే సంతలకు శుక్రవారం అధికారులు వేలం పాట నిర్వహించారు. అమడగూరు సంతకు గ్రామ సచివాలయంలో నిర్వహించిన వేలం పాటకు ప్రభుత్వ ధర రూ 32,700గా నిర్ణయించగా అంజినప్ప అనే వ్యక్తి రూ 36,500కు సంతను దక్కించుకున్నాడు. అలాగే మహమ్మదాబాద్ సంతకు ఆ గ్రామ సచివాలయంలో నిర్వహించిన వేలానికి ప్రభుత్వ ధర రూ.64,700గా నిర్ణయించగా బైరిశెట్టి అనే వ్యక్తి రూ.70,000కు సంతను దక్కించుకున్నట్లు విస్తరణాధికారి నసీమా, కార్యదర్శులు చంద్ర, సునియా తెలిపారు.